# నిన్ను పెళ్ళాడతా! కట్నంవెంతిస్తారు?

"నేను నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను."

"....నిజంగానా?"

"పెళ్ళి కూడా చేసుకుంటాను."

"నే నెంత అదృష్టవంతురాల్ని—అందరూ నన్ను నల్లపిల్ల....నల్లదీ అంటూంటే ఈ జన్మంలో నా కిక కల్యాణ యోగం లేదని యెంతగా కుమిలిపోయానో?"

"నలుపులోని నాణ్యత తెలియని వెర్రి నాగమ్మ లెవరో ఆ మాటలని ఉంటారు. నలుపులో వున్న అందం ఎందులోవుంది?"

"మీరైనా నిజాన్ని అర్థం చేసుకున్నారు."

"చూడు ఒకటి చెప్తాను. ఈ 'నలుపు'ను అసహ్యించుకుంటూ తెల్లని పెళ్ళాలే కావాలనేవాళ్ళున్నారు చూశావ్! వాళ్ళని యేం చేసినా పాపం లేదంటాను. శరీరం రంగు మాత్రమే తెలుపు కావాలనుకొనేవాళ్ళు 'నల్లటి జుత్తును' మాత్రం ఎలా సహిస్తారో? అది మాత్రం నల్లగా ఉండాలి. ఒక్క వెంట్రుక నెరసినా శరీరం తెలుపుకిచ్చిన విలువ దానికివ్వరు."

"ఎంతబాగా చెప్పారు."

"నాకు నలుపన్నా ఆ రంగులో వున్న నువ్వన్నా యెంతో యిష్టం."

"నా జీవితం ధన్యమైంది ఇన్నాళ్ళకు.'

"మన జీవితాలు యిలాగే ఆదర్శవంతంగా హాయిగా గడిచిపోతాయనే నమ్మకంతో నీతో యింతచనువు యేర్పరచుకున్నాను. ఒకరి అభిరుచులు యింకొకరం పూర్తిగా అర్థంచేసుకున్నాం కనుక మన కే ఒడిదుడుకులు వుండవనే నా నమ్మకం."

"మీలాటి వారు నాకు భర్తగా లభించటం నా పూర్వపుణ్యవిశేషం."

"నాదీ అదృష్టమే. నీ లాటి భార్య నాకు లభించబోవటం."

"ఏమండీ! మన విషయం నాన్నతో మాట్లాడరాదూ?"

"మన విషయం మాట్లాడడానికి మా న్నాన్న నెలానూ పంపుతాను. ఎందుకంటావేమో—పెళ్ళన్నాక సరదాలు....సంప్రదాయాలంటూ వుంటాయిగా."

"అంటే?"

"అదే కట్నవనీ—కానుకనీ—అందులోనూ మా నాన్న ఉన్నాడు చూశావ్! కాస్త చండశాసనుడు. నీ నలుపు చూసి మరో పదివేలు ఎక్కువే అడుగుతాడు గూడా."

"ఇచ్చుకోలేకపోతే?"

"మా నాన్నమాటను కాదనే ధైర్యం నాకు లేదు. పైగా అడిగిన కట్నం యివ్వలేకపోతే నీలాటి నల్లపిల్లని ఎవరు పెళ్ళి చేసుకుంటారు!"

—"కామెట్"